ప్రమాదకరంగా మలుపులు

- అట్కిన్‌సన్ స్కూల్ రోడ్ చివర డేంజర్ బెల్స్ మోగిస్తున్న మలుపు
- వాహనాల అతి వేగంతో మలుపులో ప్రమాదాలు
- వేగ నియంత్రణకు జిగ్‌జాగ్ బారికేడ్లు నిల్
- మలుపులో దెబ్బతిన్న కల్వర్ట్ అంచు



ప్రమాదకరంగా ఉన్న మలుపు

భవానీపురం(విజయవాడపశ్చిమ): గొల్లపూడి అట్కిన్సన్ స్కూల్ రోడ్ చివర ఉన్న మలుపు అత్యంత ప్రమాదకరంగా ఉంది. ఏ మాత్రం ఆదమరిచినా ఆ మలుపు మృత్యువు పిలుపుగా తయారయింది. రోడ్డు విశాలంగా ఉండటంతో భారీ వాహనాలు సైతం మితిమీరిన వేగంతో ప్రయాణించడమే అందుకు నిదర్శనంగా నిలుస్తుంది. మలుపు వస్తుందని తెలిసినా వాహనాలు వేగాన్ని తగ్గించకుండా టర్నింగ్ కొట్టడంతో ఎదురుగా వచ్చే వాహనాల డ్రైవర్లు స్టీరింగ్ కంట్రోల్ చేసుకోలేక పోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ముఖ్యంగా లోడుతో ప్రయాణించే భారీ వాహనాలు కూడా మలుపులో వేగాన్ని నియంత్రించుకోలేక పోవడంతో బోల్తా పడుతున్నాయి. వాటిల్లోని సరుకు రోడ్డుపై పడిపోవడంతో ట్రాఫిక్ నిలిచిపోయి ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. గతంలో హైదరాబాద్ నుంచి విజయవాడ వస్తున్న దంపతులు ఈ మలుపులోనే వేగాన్ని కంట్రోల్ చేసుకోలేక పోవడంతో బోల్తాపడి పక్కనే ఉన్న పంట కాలువ బోదెలోకి వెళ్లి పోవడం, వెంటనే కారులో నుంచి మంటలు రావడం జరిగిపోయాయి. అదృష్టవశాత్తు ఆ దంపతులు అప్రమత్తులై బోల్తపడిన కారులో నుంచి అతి కష్టంపై బయటకు వచ్చేయడంతో ప్రాణ గండం తప్పింది. డేంజర్ బెల్స్ మోగిస్తున్న ఈ మలుపులో ప్రమాదాలు నిత్యకృత్యమైనా పోలీసులు పట్టించుకున్న దాఖలాలు శూన్యం.

విజయవాడ సిటీలోకి వచ్చే వాహనాల మళ్లింపు ఇక్కడే....

హైదరాబాద్ వైపు నుంచి 65వ నెంబర్ జాతీయ రహదారి మీదుగా విజయవాడ నగరంలోకి వచ్చే వాహనాలను గొల్లపూడి బైపాస్ రోడ్‌లోని అట్కిన్సన్ స్కూల్ రోడ్‌లోకి పోలీసులు మళ్లించారు. ఆ రోడ్ చివర ఉన్న ప్రమాదకరమైన మలుపు దాటుకుని ఊర్మిళానగర్ – కబేళా సెంటర్ నుంచి చనుమోలు వెంకట్రావు (సీవీఆర్) ఫ్లైఓవర్ మీదుగా ప్రయాణించి చిట్టినగర్‌లోకి రావల్సి ఉంటుంది. అక్కడ నుంచి విజయవాడ నగరంలో ఎక్కడికైనా వెళ్లవచ్చు. హైదరాబాద్ వైపునుంచి సాధారణ లారీలు, 10–12 టైర్ల లారీలు, కంటైనర్లు, ట్రాలీలు వంటి భారీ వాహనాలన్నీ అట్కిన్‌సన్ స్కూల్ రోడ్ మీదుగానే ప్రయాణించాల్సి ఉంటుంది. అదే సమయంలో కబేళా వైపు నుంచి అట్కిన్‌సన్ స్కూల్ రోడ్‌లోకి వచ్చే వాహనాలు ఎదురు కావడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. అధిక లోడు, మితిమీరిన వేగంతో వచ్చే వాహనాలు మలుపుల్లో ఎంతో జాగ్రత్తగా వెళ్లాల్సినా డ్రైవర్ల నిర్లక్ష్యంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయనేది సుస్పష్టం. అలాగే అట్కిన్‌సన్ స్కూల్ రోడ్ విశాలంగా ఉండటంతో స్పీడ్‌గా వచ్చే వాహనాలు మలుపు దగ్గరకు వచ్చేసరికి వేగాన్ని నియంత్రించుకోలేక పోవడం..ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించుకునే ప్రయత్నం కూడా ప్రమాదాలకు కారణంగా కనిపిస్తుంది.

ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోండి



వాహనాల రాకపోకలతో నిత్యం రద్దీగా ఉండే అట్కిన్సన్ స్కూల్, కబేళా రోడ్‌లోని మలుపులో జరుగుతున్న ప్రమాదాలను నివారించేందుకు చర్యలు తీసుకోవాలి. కబేళా సెంటర్ వైపు వెళ్లే రోడ్‌లో రెండు ఫంక్షన్ హాల్స్ ఉన్నాయి. భార్యా పిల్లలతో ద్విచక్రవాహనంపై అక్కడికి వెళ్లాలన్నా అతి వేగంతో వస్తున్న భారీ వాహనాలతో భయం వేస్తుంది. యాక్సిడెంట్ చేసిన వాహనదారులు కనీసం అగకుండా వెళ్లిపోవడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనంగా కనబడుతుంది. ఈ ప్రాంతంలో ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలను చేపట్టాల్సిన బాధ్యత ట్రాఫిక్ పోలీసులపై ఉంది.

– కేసరి కృష్ణారెడ్డి, భవానీపురం.

వాహనాల వేగ నియంత్రణకు జిగ్‌జాగ్ బారికేడ్లు ఏవీ?

ఇటు అట్కిన్సన్ స్కూల్ రోడ్‌లో నుంచి అటు కబేళా సెంటర్ వైపు నుంచి వాహనాలు మలుపు దగ్గరకు వచ్చే ముందే స్పీడ్ బ్రేకర్లుగానీ లేదా జిగ్‌జాగ్ బారికేడ్లుగానీ లేకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. మలుపులో ఉన్న కల్వర్ట్ అంచు దెబ్బతిని ఉండటంతో అక్కడ వేగంగా టర్న్ అయ్యే వాహనాలు సరిగ్గా కల్వర్ట్ అంచుమీదుగా ప్రయాణిస్తున్నాయి. అదే విధంగా అట్కిన్సన్ స్కూల్ రోడ్ చివర మలుపు తిరిగే ముందు పెద్ద గొయ్యి ఉండటంతో భారీ వాహనాలు సైతం ఆ గొయ్యిని తప్పించుకుని వెళుతున్నాయి తప్ప గుంత ఉందని తెలిసి వేగం తగ్గించక పోవడం గమనార్హం. గుంతను చూసుకోకుండా వచ్చే కొన్ని వాహనాలు దానిలో నుంచి ప్రయాణిస్తున్నాయి. ప్రమాదరమైన ఈ మలుపు, ఇక్కడ జరుగుతున్న యాక్సిడెంట్లు గురించి పోలీసులకు తెలిసినా అక్కడ ఎటువంటి ప్రమాద సూచికలుగానీ, జిగ్‌జాగ్ బారికేడ్లనుగానీ ఏర్పాటు చేయకుండా చోద్యం చూస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.



మలుపు మీదుగా వెళుతున్న టిప్పర్లు, ట్రాక్టర్లు, లారీలు..ఎదురుగా వస్తున్న ఆటో, బైక్‌లు

క్లుప్తంగా

సర్వేక్షణ్ అభినందన పత్రం అందజేత




చిట్టినగర్(విజయవాడపశ్చిమ): స్వచ్ఛ సర్వేక్షణ్‌కు చక్కటి కృషి చేసిన రాకేష్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులను అభినందిస్తూ పత్రాన్ని స్కూల్ డైరెక్టర్ ఎన్వీ.రావుకు శనివారం అందచేశారు. శానిటరీ అధికారులు ఓబులేశ్వరరావు, శానిటరీ సిబ్బంది ఆనంద్ శనివారం స్కూల్ డైరెక్టర్ ఎన్వీ రావును కలిసి అభినందన పత్రాన్ని అందజేశారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌కు స్కూల్ డైరెక్టర్‌తో పాటు విద్యార్థులు, ఉపాధ్యాయులు చక్కటి సహకారం అందించడమే కాకుండా ప్రజలకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు. విద్యార్థులు బాధ్యతను గుర్తించి కమిషనర్ ధ్యానచంద్ర అభినందనలు తెలిపారన్నారు. ఇలాంటి అభినందన పత్రాలు సమాజం పట్ల బాధ్యతను మరింత పెంచుతుందని ఎన్వీ రావు పేర్కొన్నారు.

దుర్గమ్మకు నృత్య నీరాజనాలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు పలువురు కళాకారులు నృత్య నీరాజనాలను అర్పించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై విజయవాడకు చెందిన శ్రీ కూచిపూడి నృత్య అకాడమికి చెందిన కొండవీటి శ్రీదేవి శిష్యబృందం పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన ఇచ్చారు. కోరపాటి అన్విత శిష్యబృందం భరతనాట్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారికి పంచహారతుల సేవ అనంతరం కళావేదికపై నిర్వహించిన నృత్య ప్రదర్శనను భక్తులు ఎంతో ఆసక్తిగా వీక్షించారు. నృత్య ప్రదర్శన అనంతరం కళాకారులను ఆలయ డీఈవో రత్నరాజు అభినందించి అమ్మవారి ప్రసాదాలను అందజేశారు.

కాత్యాయినిదేవిగా భ్రమరాంబ అమ్మవారు దర్శనం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని పాత శివాలయంలో భ్రమరాంబ అమ్మవారు శనివారం కాత్యాయినిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వన్‌టౌన్‌లోని పురాతన ఆలయమైన భ్రమరాంబ మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం (పాత శివాలయం)లో కార్తీకమాసాన్ని పురస్కరించుకొని కార్తీక నక్షదీక్షా మహోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా అమ్మవారు రోజుకొక విశేష అలంకారంలో భక్తులకు దర్శనమిస్తున్నారు. మహోత్సవాల్లో భాగంగా ఆలయంలో శనివారం పలు ప్రత్యేక వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. కాత్యాయినిదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారికి సహస్రనామార్చనతో పాటుగా విశేషంగా త్రిశతి, ఖడ్గమాల తదితర కార్యక్రమాలను నిర్వహించారు. అలాగే స్వామి వారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, మహాలింగార్చన, ఆలయ ప్రదక్షిణలు, పంచహారతులు నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ కార్య నిర్వహణాధికారి పర్యవేక్షించారు.

సామాజిక సేవలు విస్తృతం చేయాలి



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రోటరాక్ట్ సభ్యులు సామాజిక సేవలను మరింత విస్తృతం చేయాలని రోటరీ క్లబ్ మాజీ డిస్ట్రిక్ట్ గవర్నర్ రావూరి సుబ్బారావు అన్నారు. పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ రోటరాక్ట్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రియ విజయం పేరుతో రోటరాక్ట్ కాన్ఫరెన్స్ జోన్ -3 కార్యక్రమాన్ని శనివారం ఆ కళాశాల ప్రాంగణంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రావూరి సుబ్బారావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రోటరీ సంస్థల సౌజన్యంతో కళాశాలల్లో రోటరాక్ట్ క్లబ్‌లు కొనసాగుతాయన్నారు. విద్యార్థి దశలో సామాజిక సేవల పట్ల అవగాహన పెంచటంతో పాటుగా ఉన్నతమైన భావాలను పెంపొందించేందుకు ఈ క్లబ్‌లు పని చేస్తాయన్నారు. కళాశాల కోశాధికారి కె.రాఘవయ్య, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సురేష్ బాబు మాట్లాడారు. కళాశాల క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు అర్పితాభరద్వాజ్, అచ్యుత నిర్వహించారు. జగదీష్, కరంబీర్‌కౌర్ తదితరులు ప్రసంగించారు. క్లబ్ కోఆర్డినేటర్ డాక్టర్ నరేష్ పర్యవేక్షించారు.

టీడీపీ అడ్డాకు ఆటంకంగా ఉన్న బస్ షెల్టర్ తొలగింపు



టీడీపీ అడ్డాగా ఉపయోగించుకున్న స్థలం ముందు తొలగించిన బస్ షెల్టర్ ప్రదేశం



టీడీపీ ఉపయోగించుకుంటున్న స్థలంలో తొలగించిన బస్ షెల్టర్ సామగ్రి

- షెల్టర్ స్థలం కబ్జా కోసమే రాత్రికి రాత్రి కూల్చివేత
- టీడీపీ నాయకుడితో స్థల యజమాని లాలూచీ
- జాతీయ రహదారి నుంచి నేరుగా స్థలంలోకి మార్గం?

భవానీపురం(విజయవాడపశ్చిమ): పశ్చిమ నియోజకవర్గం గట్టు వెనుక 40వ డివిజన్ పరిధిలో కనకదుర్గ ఫ్లైఓవర్‌కు దిగువన ఉత్తరం వైపు ఉన్న బస్ షెల్టర్‌ను తొలగించిన వైనం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దశాబ్ద కాలంగా ఉన్న బస్ షెల్టర్‌ను ఈ నెల 5వ తేదీ గుట్టు చప్పుడు కాకుండా రాత్రికి రాత్రే తొలగించటంతో మరునాడు ఉదయమే అక్కడ ఉండాల్సిన బస్ షెల్టర్ మాయం కావడంపై స్థానికులు ముక్కున వేలేసుకున్నారు. తొలగించిన బస్ షెల్టర్ వెనుక వన్‌టౌన్‌లోని ఒక వ్యాపారికి సుమారు వెయ్యి చదరపు గజాల ఖాళీ స్థలం ఉంది. దానిని 40వ డివిజన్‌కు చెందిన టీడీపీ వర్గం గత కొన్నేళ్లుగా తమ అడ్డాగా వాడుకుంటున్నారు. ఉదయం, సాయంత్రం అక్కడే (ఖాళీ స్థలం) కుర్చీలు వేసుకుని డివిజన్ కార్యాలయం అని చెప్పుకుంటున్నారు. అక్కడే సమావేశాలు, పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. స్థలానికి తూర్పు వైపు డాల్ఫిన్ బార్ రోడ్, దక్షిణాన జాతీయ రహదారి ఉంది. ఈ నేపథ్యంలో ఆ స్థల యజమానికి అక్కడ కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మించాలని, దానికి జాతీయ రహదారి నుంచి దారి ఏర్పాటు చేసుకోవాలన్న ఆలోచన వచ్చింది. అంతే.. పొద్దున లేస్తే అక్కడే కూర్చుంటున్న స్థానిక టీడీపీ నాయకుల ద్వారా పశ్చిమ నియోజకవర్గంలోని టీడీపీ ముఖ్య నేతతో మంతనాలు జరిపారు స్థల యజమాని. రాజు తలుచుకుంటే దెబ్బలకు కొదవ అన్నట్లు అధికారంలో ఉన్న టీడీపీ నేత మద్దతుతో ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మించిన బస్ షెల్టర్‌ను మూడో కంటికి తెలియకుండా మంగళవారం రాత్రి సమయంలో కూల్చేశారు. దీంతో షెల్టర్ ఉన్న స్థలాన్ని కబ్జా చేసి తమ స్థలంలో కలిపేసుకునేందుకే షెల్టర్‌ను తొలగించినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. అంతే కాకుండా వీఎంసీ, ఆర్టీసీ అధికారులకు ఫిర్యాదుకూడా చేశారు. అయితే అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లతో సంబంధిత అధికారులు అటు వైపు కన్నెత్తి చూసిన పాపాన పోలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బస్ షెల్టర్ స్థలాన్ని కబ్జా నుంచి రక్షించి షెల్టర్‌ను పురుద్ధరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

వైభవంగా శ్రీవారి కల్యాణోత్సవం

- నేత్రపర్వంగా సహస్రదీపాలంకరణ
- శాస్త్రోక్తంగా స్వామి వారికి తిరుమంజనం



స్వామి వారి కల్యాణోత్సవం



సహస్రదీపాలంకరణ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వేంకటేశ్వరస్వామి వారి కల్యాణోత్సవం శనివారం వైభవంగా జరిగింది. బ్రాహ్మణవీధిలో దేవదాయ ధర్మాదాయ శాఖ పరిధిలోని పురాతన ఆలయాల్లో ఒకటైన వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో స్వామి వారి జన్మనక్షత్రమైన శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకొని స్వామి వారికి శాంతి కల్యాణోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. కార్తీకమాసంలో వచ్చే శ్రవణానక్షత్రానికి విశేషం ఉందని పండితులు చెబుతారు. అందులోను స్వామి వారికి ప్రీతికరమైన శనివారం సైతం రావటంతో అత్యంత పవిత్రమైనదిగా భావించి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ,ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని శ్రీకృష్ణ మండపంలో స్వామి వారి ఉత్సవమూర్తులను మేళతాళాలతో తీసుకొచ్చి కల్యాణ వేదికపై వేంచేయించారు. అనంతరం ఆలయ అర్చక స్వాములు పి.రామచంద్రమూర్తి పర్యవేక్షణలో స్వామి వారి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. తొలుత విష్వక్సేనపూజతో కల్యాణోత్సవానికి శ్రీకారం చుట్టారు. అనంతరం మహాసంకల్పం, ప్రవర, యజ్ఞపవీతధారణ, జీలకర్రబెల్లం ధారణ, మంగళ్యధారణ, చివరిగా తలంబ్రాల సమర్పణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామి వారి ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

స్వామి వారి జన్మనక్షత్రాన్ని పురస్కరించుకొని ఆలయంలోని స్వామి వారి మూలవిరాట్‌కు తిరుమంజనం వైభవంగా నిర్వహించారు. వివిధ ఫల, సుగంధ ద్రవ్యాలతో, పంచామృతాలతో స్వామి వారిని అభిషేకించారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక అలంకారం చేశారు. సహస్రనామార్చనను నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకొని పూజలు చేశారు. కార్తీక మాసం, శ్రవణానక్షత్రం, శనివారం స్వామి వారికి విశేషమైన పర్వదినంగా పురస్కరించుకొని ఆలయ ప్రాంగణంలో సాయంత్రి సహస్రదీపాలంకరణ సేవ నిర్వహించారు. పొన్నంగిపల్లి దీక్షిత్ తదితరులు కార్యక్రమాలు నిర్వహించారు.

భవానీ దీక్షలకు పటిష్ట బందోబస్తు


పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖరబాబు



భవానీ దీక్షల బందోబస్తుపై చర్చిస్తున్న సీపీ రాజశేఖరబాబు

విజయవాడస్పోర్ట్స్: శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం వద్ద ఈనెల 11 నుంచి డిసెంబర్ 25వ తేదీ వరకు జరిగే భవానీ దీక్షల కార్యక్రమానికి పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖరబాబు తెలిపారు. బందోబస్తు ఏర్పాట్లపై కమాండ్ కంట్రోల్ రూంలో శనివారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ రాజశేఖరబాబు మాట్లాడుతూ ఈ నెల 11 నుంచి 15వ తేదీ వరకు భవానీ దీక్షల మాలాధారణ, డిసెంబర్ 14న కలశ జ్యోతి, డిసెంబర్ 21 నుంచి 25వ తేదీ వరకు దీక్షల విరమణ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఆంధ్రప్రదేశ్‌తోపాటు ఇతర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో వస్తారని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా తీసుకోవాల్సిన చర్యలను సమావేశంలో చర్చించారు. సమావేశంలో ఆలయ ఈఓ కె.ఎస్. రామారావు, డీసీపీలు గౌతమి శాలి, ఉదయ రాణి, తిరుమలేశ్వరరెడ్డి, కృష్ణమూర్తి నాయుడు, ప్రసాద్, ఏడీసీపీలు రామకృష్ణ, ప్రసన్న కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీప్లేన్ డెమో ప్రారంభం



విజయవాడ భవానీపురం పున్నమిఘాట్ వద్ద సీ ప్లేన్ డెమోను వీక్షించేందుకు వచ్చిన ప్రజలు, చిన్నారులు, విద్యార్థులకు ఎటువంటి ఏర్పాట్లు చేయలేదు. సీఎం సందేశం అనంతరం వరకు సీ ప్లేన్ డెమో ప్రారంభించకపోవడంతో ఇలా ఎర్రటి ఎండలో గంటల తరబడి వేచి ఉన్న దృశ్యమిది. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



వర్సిటీ క్రీడా ప్రాంగణాల నిర్వహణను ఏసీఏకి ఇవ్వండి

గవర్నర్‌కు ఎంపీ, ఏసీఏ అధ్యక్షుడు కేశినేని చిన్ని వినతి



గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంపీ, ఏసీఏ అధ్యక్షుడు కేశినేని చిన్ని

విజయవాడస్పోర్ట్స్: రాష్ట్రంలోని ప్రముఖ విశ్వవిద్యాలయాల పరిధిలోని క్రీడా ప్రాంగణాల నిర్వహణ, అభివృద్ధి ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్(ఏసీఏ) పరిధిలోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు విజయవాడ ఎంపీ, ఏసీఏ అధ్యక్షుడు కేశినేని శివనాథ్ (చిన్ని) విజ్ఞప్తి చేశారు. ఏసీఏ కార్యదర్శి సానా సతీష్‌బాబు, కోశాధికారి డి.శ్రీనివాస్‌తో కలిసి ఎంపీ చిన్ని శనివారం విజయవాడలోని రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. వర్సిటీల క్రీడా ప్రాంగణాల నిర్వహణ, అభివృద్ధికి సంబంధించిన ఒప్పంద నియమాల విషయమై గవర్నర్‌తో ఏసీఏ ప్రతినిధులు చర్చించినట్లు ఆంధ్రా క్రికెట్ సంఘం ఒక ప్రకటనలో పేర్కొంది.

వైభవంగా అయ్యప్ప స్వామి పడిపూజ మహోత్సవం



అయ్యప్ప స్వామి పడిపూజ వేదిక

భవానీపురం (విజయవాడపశ్చిమ): స్థానిక క్రాంబ్వే రోడ్‌లోని పీఆర్‌కె బిల్డింగ్ రోడ్‌లో ఏలూరు సాయి శరత్, తడికమళ్ల ఆదిత్య స్వాముల బృందం ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన అయ్యప్ప స్వామి పడిపూజ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. వేదికపై మూడు మందిరాలను ఏర్పాటు చేసి ఒక దానిలో విఘ్నేశ్వరుడు, ఇంకొక దానిలో కుమార స్వామి మధ్యలో అయ్యప్ప స్వామి విగ్రహాలను ఏర్పాటు చేశారు. అలాగే వేదిక ముందు శబరిమలలో మాదిరిగా పద్దెనిమిది మెట్లను తీర్చిదిద్దారు. అయ్యప్ప స్వామి విగ్రహానికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. మాలాధారులు వెలిగించిన కర్పూర హారతులను తిలకించిన భక్తులు 'స్వామి శరణం..అయ్యప్ప శరణం' అంటూ ఎలుగెత్తి భక్తి పారవశ్యంతో చేసిన శరణు ఘోషతో ఆ ప్రాంతం మారుమోగిపోయింది. ఈ పడిపూజ మహోత్సవంలో మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ, పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ పాల్గొని అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో తెల్లనాకులు రాకేష్, అడపా హరీష్, స్థానిక భక్తులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి ఈత పోటీలకు ఎంపిక



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన స్విమ్మర్లు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): 24వ తేదీ నుంచి గుజరాత్‌లో నిర్వహించే జాతీయస్థాయి పోటీలకు కేఎల్‌రావు స్విమ్మింగ్ పూల్‌కు చెందిన స్విమ్మర్లు ఎంపికైనట్లు కోచ్ రఫీ తెలిపారు. కేఎల్‌రావు స్విమ్మింగ్ పూల్‌లో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను కోచ్, తోటి స్విమ్మర్లు అభినందించారు. ఈ నెల 5వ తేదీ నుంచి 7వ తేదీ వరకు నర్సరావుపేటలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి స్కూల్స్ గేమ్స్ చాంపియన్స్ పోటీల్లో కేఎల్‌రావు స్విమ్మింగ్ పూల్‌లో శిక్షణ పొందిన ఎస్.శ్రుతి హర్షిక వంద మీటర్ల బ్యాక్ స్ట్రోక్‌లో రెండో స్థానం, రెండు వందల మీటర్ల విభాగంలో మూడో స్థానంలో నిలిచాడన్నారు. ఎస్.చంద్ర హర్షిల్ రెండు వందల మీటర్ల ఫ్రీ స్టైల్ విభాగంలో రెండో స్థానంలో, కె.భావేష్ 1500 మీటర్ల ఫ్రీ స్టైల్ విభాగంలో మూడో స్థానంలో నిలిచి జాతీయ పోటీలకు అర్హత సాధించారని వెల్లడించారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన స్విమ్మర్లను నగర పాలక సంస్థ అధికారులు, జిల్లా స్విమ్మింగ్ సంఘ సభ్యులు అభినందనలు తెలిపారు.

14న ఉచిత మధుమేహ వైద్య పరీక్షలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రపంచ మధుమేహ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 14న మొగల్రాజపురం రత్నమాంబ వీధిలోని మురళీకృష్ణ కేర్ అండ్ క్యూర్ హాస్పటల్, త్రినయన ఐ కేర్‌లో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆస్పత్రి నిర్వాహకులు డాక్టర్ టీవీ మురళీకృష్ణ తెలిపారు. ఆ రోజు ఉదయం 7 నుంచి రాత్రి 8 గంటల వరకూ నిర్వహించే ఈ శిబిరంలో ఎఫ్‌బీఎస్, పీపీబీఎస్, ఆర్‌బీఎస్‌తో పాటు, హెచ్‌బీఏ1సీ పరీక్షలు చేయనున్నట్లు తెలిపారు. వీటితో పాటు ఫైబ్రోస్కాన్(ఫ్యాటీ లివర్ స్కాన్) చేయనున్నట్లు తెలిపారు. ఈ శిబిరంలో జనరల్ ఫిజిషియన్, డయాబెటాలజిస్ట్ అయిన తనతో పాటు, కంటి వైద్య నిపుణురాలు డాక్టర్ సి.త్రివేణి పరీక్షలు చేస్తారని పేర్కొన్నారు. ఈ నెల 14 నుంచి 30 వరకూ రెండు సార్లు మధుమేహం, కంటి వైద్యుల ఉచిత కన్సల్టేషన్ పొందవచ్చని తెలిపారు. తమ పేర్లు రిజిస్ట్రేషన్ కోసం 7981643518, 6281701748 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

కళాకారులు సాంస్కృతిక వారధులు



విజయవాడ కల్చరల్: కళాకారులు సాంస్కృతిక వారధులని ప్రముఖ న్యాయవాది ముష్టి శ్రీనివాస్ అన్నారు. ఏఎస్ మెలోడీస్ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదికపై శనివారం ఆ సంస్థ ఆవిర్భావ సభ, సినీ సంగీత విభావరి, వివిధ రంగాలకు చెందిన వారికి ఆత్మీయ సత్కార కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీనివాస్ మాట్లాడుతూ సాంస్కృతిక కళాసంస్థలు ప్రజాసేవలో భాగస్వాములు కావాలని సూచించారు. నూతన సంస్థ విజయవంతం కావాలని ఆశీర్వదించారు. సంస్థ వ్యవస్థాపకురాలు షేక్ సబానా మాట్లాడుతూ విలువలతో కూడిన కార్యక్రమాలను రూపొందించి వేదికపై ప్రదర్శిస్తామని తెలిపారు. కార్యక్రమ కోఆర్డినేటర్ ఆరిఫ్ మాట్లాడుతూ ప్రతి నెలా కార్యక్రమాలను నిర్వహిస్తామని, నూతన గాయనీ గాయకులకు అవకాశం కల్పిస్తామని చెప్పారు. కళాకారుల సంక్షేమం కోసం కృషి చేస్తామని పేర్కొన్నారు. గాయనీ గాయకులు మల్లాది స్వాతి, షబానా, శ్రావణి వెంకట్ తదితరులు తెలుగు, హిందీ చిత్రగీతాలను ఆలపించారు. కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన మీరా కుమార్, ముష్టి శ్రీనివాస్, చింతకాయల చిట్టిబాబు, డేవిడ్ రాజులను ఆత్మీయంగా సత్కరించారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని విజయవాడ ఆర్ట్ సొసైటీ, ఠాగూర్ స్మారక గ్రంథాలయం సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
విజయవాడ వెస్ట్ :
90102 10386
Office mail : sakshiads@gmail.com